### టూరిజం ట్రేడ్ రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

**ఏలూరు:** జిల్లాలోని హోటల్ యజమానులు తమ హోటళ్లకు టూరిజం ట్రేడ్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి ఎమ్‌డి.హెచ్.మెహ్రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు, వెల్‌నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్స్ అందరూ ట్రేడ్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆదేశాలకనుగుణంగా ట్రేడ్ రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వ సర్టిఫికెట్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే నిధి-సాతి సర్టిఫికెట్ వస్తుందన్నారు. వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ కింద ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించిన ఫీజుల వివరాలు, టూర్ బోటు ఆపరేటర్లు, అడ్వంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లకు రూ.500, వెల్‌నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాల్, సర్వీస్ అపార్ట్‌మెంట్లకు రూ.500, హోటళ్లు, లాడ్జి, రెస్టారెంట్లు, గెస్ట్ హౌస్‌లకు రూ.300, హోమ్ స్టేలు, ఫామ్ స్టేలకు రూ.200 చొప్పున రుసుముతో www.aptourism.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. పూర్తి వివరాలకు పర్యాటక అధికారి 9849909082, 6309942024 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# అటకెక్కిన ఆధునికీకరణ..!

- ఏప్రిల్ 30న కాలువలు మూసివేత
- అయినా పనులకు దక్కని ప్రభుత్వ ఆమోదం
- పెండింగులో దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువైన పనులు
- వైసిపి ప్రభుత్వం వచ్చాక ఒక్క పనీ చేయని పరిస్థితి
- కేవలం మెయింటెనెన్స్ పనులకే పరిమితం

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

డెల్టా ఆధునికీకరణ పనులను ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించేసింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక గడిచిన నాలుగేళ్లలో ఆధునికీకరణకు సంబంధించిన పనులను పట్టించుకోని దుస్థితి నెలకొంది. దీంతో ప్రతియేటా రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ప్రతియేటా అధిక వర్షాలకు పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం ఆధునికీకరణ పనుల గురించి పట్టించుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వానికి ఇదే ఆఖరి ఏడాది కావడంతో ఈసారైనా ఆధునికీకరణ పనులు జరుగుతాయని అంతా భావించారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఏప్రిల్ 30న పంట కాలువలకు సాగునీరు విడుదల నిలిపివేశారు. మళ్లీ జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల ఉంటుంది. ఈ నెల రోజుల్లో కాలువల పూడికతీత, గేట్లకు సంబంధించిన స్ట్రక్చర్ పనులు వంటివి పెద్దఎత్తున జరగాల్సి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు రూ.వెయ్యి కోట్లు విలువైన ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రతియేటా మాదిరిగా ఈసారీ ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ రాలేదు. దీంతో వేసవిలో కాలువల ఆధునికీకరణ పనులు అనేవి జరగని పరిస్థితి ఉంది. జిల్లాలో 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాలోని 5.29 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. గడిచిన నాలుగేళ్లుగా కాలువలకు సంబంధించి ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఎక్కడికక్కడే పూడుకుపోయాయి. కాలువలపైన ఉన్న డ్యామ్‌లకు సంబంధించి షట్టర్లు వంటివి పూర్తిగా పాడైపోయాయి. ఈ పనులు త్వరితగతిన చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేవలం ప్రతియేటా మెయింటెనెన్స్ పనులతో మమ అన్పిస్తోంది.

**ఏటా వేలాది ఎకరాల్లో పంట నష్టం**

ప్రతియేటా ఖరీఫ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో పెద్దఎత్తున పంటనష్టం వాటిల్లుతోంది. దీనికి ప్రధాన కారణం కాలువలు మెరకదేరిపోవడమే. ఆధునికీకరణ లేకపోవడంతో కాలువల గుండా వర్షపు నీరు కిందకు పారడం లేదు. దీంతో పొలాల్లో నీరు నిలిచిపోయి పెద్దఎత్తున పంట నష్టం జరుగుతోంది. నారుమడుల సమయంలోనూ, నాట్లు తరుణంలోనూ రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.ఆరు వేలు నష్టపరిహారం కింద ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. రబీలోనూ సాగునీటి ఎద్దడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కౌలురైతులకు అందడం లేదు. దీంతో వాస్తవ సాగుదారుడైన కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ఆధునికీకరణ పనులు జరిగితే వర్షాలకు జరిగే పంటనష్టం నుంచి రైతులు బయటపడే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఆధునికీకరణ పనులను నాలుగేళ్లుగా పూర్తిగా అటకెక్కించేసింది. వచ్చే వేసవిలో సాధారణ ఎన్నికలు జరగనుండటంతో ఆధునికీకరణ పనులపై ఇక ఆశలు వదులుకోవాల్సిందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

## 1998 డిఎస్‌సి అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

**ప్రజాశక్తి - ఏలూరు**

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన 1998 డిఎస్‌సి అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఎస్‌సి అభ్యర్థులు స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 1998 డిఎస్‌సిలో క్వాలిఫై అయ్యి, రికార్డు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, రిజర్వేషన్లు పాటించాలని కోరారు. ఈ రిజర్వేషన్లలో ఎక్కడకూడా దళితులకు న్యాయం జరగలేదని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం అని చెబుతూ 1200 మంది ఒకేలా పోస్టింగ్ కల్పించారన్నారు. 1998లో రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సిలకు 40 పోస్టులు మాత్రమే రావడం బాధాకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి డిమాండ్

**ప్రజాశక్తి - ఏలూరు**

ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల వర్షాలకు ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరుదలకు వచ్చిన ధాన్యాన్ని సైతం సకాలంలో కొనుగోలు చేయకపోవడం, అడిగినా సరిపడా సంచులు ఇవ్వకపోవడం, రవాణాకు లారీలు ఏర్పాటు చేయకపోవడం, లక్ష్యానికి మించి ధాన్యం కొనొద్దంటూ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలివ్వడం వంటి ప్రభుత్వ చర్యల వల్ల అన్నదాతలు నేడు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మొరపెట్టుకున్నా అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ప్రస్తుత వర్షాలకు పంటలు తడిసి రైతులు నష్టపోయారని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యతవహించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిధాన్యం చాలా చోట్ల మొలకలు వస్తున్నాయని, తక్షణం విల్లులుకు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని, సరిపడా సంచులు అందించాలని, రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కేవలం వరి పంట మాత్రమే కాదని, మొక్కజొన్న, పసుపు, మిరప తదితర పంటల రైతులను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గోనె సంచుల స్టాకును పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

## ఆర్‌బికెల్లో జెసి విస్తృత తనిఖీలు

**ప్రజాశక్తి - దెందులూరు రూరల్**

మండలంలోని సీతంపేట, కొవ్వలిలోని రైతు భరోసా కేంద్రాలను జెసి బి.లావణ్యవేణి మంగళవారం తనిఖీ చేశారు. తేమ శాతం, గోనె సంచుల స్టాకు, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రిజిష్టర్లు, ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు, అగ్రికల్చర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌ల జాబ్‌ఛార్ట్ గురించి, రైతులు సమావేశమైన తేదీల నమోదు చేసే మినిట్ బుక్స్, రైతుల సమస్యలపైనా రైస్ మిల్లుల వివరాలు పరిశీలించారు. రిజిష్టర్ నిర్వహణలోనూ, కార్యాలయ నిర్వహణలోనూ సిబ్బంది అలసత్వం వహిస్తున్నట్లు స్పష్టమవుతుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ విధుల్లో ఆలసత్వంవహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం కొవ్వలి రైతు భరోసా కేంద్రంలో గోనె సంచుల సరఫరా, రవాణా సౌకర్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన వెనువెంటనే కొనుగోలు ప్రక్రియ యథాతధంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే 46 శాతం ధాన్యాన్ని రైతుల వద్దనుండి కొనుగోలు చేశామన్నారు. ధాన్యానికి నష్టం వాటిల్లిందని సంబంధిత వ్యవసాయ శాఖ వారిచే ధృవీకరిస్తే అట్టి ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ విషయంలో రైతులు ఎవ్వరూ ఆందోళన చెందొద్దన్నారు. వీరి వెంట తహాశీల్దారు నాంచారయ్య, వ్యవసాయశాఖ ఎడి వై.సుబ్బారావు, ఎఒ జి.రమేష్, సీతంపేట సొసైటీ అధ్యక్షులు వెంకట్రామయ్య, సర్పంచి కనకరాజు, కొవ్వలి సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మిన రామారావు,ఉన్నారు.

## 'ఉపాధి' పరిరక్షణ యాత్ర జయప్రదానికి పిలుపు

### 4 నుంచి 13 వరకూ సాగనున్న యాత్ర - కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఏలూరు**

ఈనెల నాలుగో తేదీ నుంచి 13వ తేదీవరకూ జిల్లావ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చేపడుతున్న ఉపాధి హామీ చట్ట పరిరక్షణ జిల్లాయాత్రను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పులుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తలచే కరపత్రాలను స్థానిక అన్నే భవనంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కోట్లాది మంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టడానికి తీసుకొచ్చిన ఉపాధిహామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటలా పని విధానం తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధి కూలీలకు తీవ్రనష్టం జరుగుతుందని మండిపడ్డారు. ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు బిజెపి చేసిన అనేక కుట్రల్లో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషికం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతుందన్నారు. కోట్లాది మందికి సొంతగ్రామాల్లో ఉపాధి చూపించి కొద్దోగొప్ప పేదల కొనుగోలు శక్తిని ఉపాధి హామీ పెంచిందన్నారు. 2020లో కరోనా సమయంలో పేదల ఆకలిచావులు సంభవించకుండా కాపాడిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో బిజెపి రూ.30 వేలకోట్ల నిధులు తగ్గించి ఉపాధిహామీ పీక నొక్కిందన్నారు. అంటే ఏడాదికి కుటుంబానికి 22 పని దినాలకు మాత్రమే సరిపోతుందన్నారు. దీన్ని బట్టి బిజెపి పేదల పట్ల ఎలాంటివైఖరితో ఉందో అర్థమవుతుందన్నారు. బిజెపి విధానాలకు రాష్ట్రప్రభుత్వం వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లాకమిటీ సభ్యులు ఎస్.మహంకాళి, పి.మురళీ, ఎం.హోలీమేరీ, పి.లక్ష్మయ్య, సిహెచ్.మాధవ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. ఆక్వా రైతులు కుదేలు..!

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

చేపలు పడుతున్న రైతులు

మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆక్వారైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ మార్పుతో చేపలు, రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో పలు గ్రామాల్లో చేసేది లేక రైతులు చేపలు, రొయ్యలు హడావుడిగా పట్టుబడులు చేపట్టి అయినకాడికి అమ్ముకుంటున్నారు. మండలంలోని పలుప్రాంతాల్లో చేపలు చనిపోకుండా వివిధ రకాల మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. చెరువుల్లో పిహెచ్ శాతం, డిఒ శాతం బాగా తగ్గింది. మండలంలో సుమారు 13 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేపట్టారు. అకాల వర్షాలకు వాతావరణం మార్పుతో రొయ్యలకు వైరస్ సోకి వివిధ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఏర్పడింది. మరో వారం రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరింస్తుండడంతో ఆక్వా రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రోజు, రోజుకీ వాతావరణం మారుతుండడంతో పంట చేతికి వస్తుందో రాదోనని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ దశలో మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు చెరువుల్లో ఉన్న చేపలను, రొయ్యలను దక్కించుకునేందుకు పట్టుబడులు పడుతున్నారు. అకాల వర్షంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో చేపలు చనిపోతున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆక్వా రైతులు పట్టుబడులు చేస్తున్నారు.

**రొయ్యకు వైరస్ సోకింది.**

**ఆక్వా రైతు, పేరే రామకృష్ణ, రాజనగరం**

అకాల వర్షాలు ఆక్వారైతులకు తీవ్ర నష్టం కలుగజేశాయి. గతనాలుగు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా రొయ్యకు వైరస్ సోకింది. 20, 25 రోజుల రొయ్యల చెరువులకు మైక్రో వైరస్ సోకింది. దీంతో ఆక్వా రైతుకు నష్టం వాటిల్లింది.

ధాన్యం రాశులు పరిశీలిస్తున్న నాయకులు

## నూక శాతం పేరుతో మోసాలు అరికట్టాలి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ధాన్యం నూక శాతం పేరుతో మిల్లర్లు చేస్తున్న మోసాలను అరికట్టాలని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బొమ్మిడి, బాదంపూడి గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో సమస్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం నూక శాతం పేరుతో మిల్లర్లు డబ్బు వసూలును ఆపాలన్నారు. నూక శాతాన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద నిర్ధారించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం చేయడం వల్ల అకాల వర్షాలకు తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా గోనె సంచులు ఇవ్వాలని, ధాన్యం రవాణాకు తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని కోరారు.

తడిచిసి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు దుడే కేశవ, పి.సురేష్, డి.నాగేశ్వరరావు, డి.మురళీ పాల్గొన్నారు.


మంత్రికి వినతిని అందిస్తున్న ప్రజాప్రతినిధులు

## మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి కొల్లేరు సమస్యలు

**ప్రజాశక్తి - కైకలూరు**

కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అటవీశాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కైకలూరు నియోజకవర్గ వైసిపి ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం తాడేపల్లిలోని అటవీశాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కైకలూరు నియోజకవర్గ ప్రజల సమస్యలు, కొల్లేరు సమస్యలపై కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, జిల్లా పరిషత్ ఛైర్మన్, శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్, సయ్యపరాజు గుర్రాజు కలిసి మంత్రికి వివరించారు.

## నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, రాజు

**ప్రజాశక్తి - చింతలపూడి**

నాయీ బ్రాహ్మణులకు విద్య, ఉద్యోగరంగాల్లో ఏయే రిజర్వేషన్లు అమలవుతున్నాయో రాజకీయరంగంలోనూ అవే రిజర్వేషన్లు అమలు చేయాలని నాయీబ్రహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యు.బాలగురుస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు కోరారు. లింగపాలెం మండలం రంగాపురం సెంటర్‌లోని సత్యశ్రీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొప్పాక వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కొప్పాక వీర వెంకట సత్యనారాయణ, బిసి సంక్షేమ సంఘం జెఎసి ఛైర్మన్ డాక్టర్ లంకా వెంకటేశ్వరరావు, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తురాయి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు, పలుగ్రామాల సర్పంచులు లింగంశెట్టి అనంతలక్ష్మి, శ్రీనివాస్, ముసునూరి రాము, ఇనుగంటి రాజేష్ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

### నేడు రాస్తారోకో

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

32 మంది ప్రాణత్యాగాలతో, ఎన్నో పోరాటాలతో ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరణ చేయకుండా పరిరక్షించుకోవాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు సమావేశమై ఈ నెల మూడో తేదీన చేపట్టనున్న రాస్తారోకో కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ 32 మంది ఆత్మబలిదానంతో సాధించుకున్న విశాఖఉక్కును బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరించేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ 800 రోజులకుపైగా కార్మికులు ఉద్యమం చేస్తుంటే ప్రధాని మోడీ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాలు, వామపక్షాలు, రైతుసంఘాలు రాస్తారోకోలు చేయాలని పిలుపునిచ్చాయని తెలిపారు. ఈనెల మూడో తేదీ ఉదయం పది గంటలకు ఏలూరు వసంతమహల్ సెంటర్లో రాస్తారోకో చేయాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ఈ రాస్తారోకోలో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్)తో పాటు కార్మిక సంఘాలు, వామపక్ష సానుభూతిపరులు, రైతులు, రైతు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని, జిల్లాలోని కార్పొరేషన్‌తోపాటు మున్సిపల్, పట్టణ, నగర పంచాయతీ, మండల కేంద్రాల్లో కూడా రాస్తారోకోలు చేసి విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక పరిశ్రమ విశాఖపట్నం పరిరక్షించుకోవడానికి ప్రజానీకం కలిసి రావాలని విజ్ఞప్తిచేశారు. పార్టీలకు అతీతంగా టిడిపి, వైసిపి, జనసేన కార్మికులకు మద్దతుగా ప్రత్యక్షంగా రాస్తారోకోలో పాల్గొనాలన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడానికి పది వామపక్షాలు, కార్మిక సంఘాలు చేస్తున్న రాస్తారోకోకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ జిల్లా నాయకులు టివిఎస్.రాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి రాజనాల రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

**భీమడోలు:** విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈ నెల మూడో తేదీ భీమడోలు జంక్షన్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో చేసేందుకు రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. ఈ మేరకు భీమడోలులోని సిఐటియు కార్యాల యంలో లింగరాజు అధ్యక్షతన అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లింగరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం 32 మంది ప్రాణత్యాగాలు చేశారన్నారు. విశాఖ ఉక్కును మోడీ ప్రభుత్వం అమ్మే ప్రయత్నం చేయటం దుర్మార్గమని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న వైసిపి మండల కన్వీనర్ రాయపాటి సత్యశ్రీనివాస్, రామకుర్తి నాగేశ్వరరావు, టిడిపి ఉంగు టూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ నాయకులు పి.యుగంధర్, రమణ, బిసి సంఘాల నేత పి.సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్, భీమడోలు సర్పంచి పి.సునీతా మాన్‌సింగ్, సిపిఎం నాయకులు కట్టా భాస్కర రావు, రైతు సంఘం నాయకులు జి.ప్రసాదరావు రాస్తారోకోకు మద్దతు తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ, యుటిఎఫ్ నాయకులు

## రామిరెడ్డి ఆశయాలు, సేవలు ఆదర్శం : సాబ్జీ

**ప్రజాశక్తి - ఏలూరు**

యుటిఎఫ్ ఉద్యమ నిర్మాత దాచూరి రామిరెడ్డి ఏడో వర్ధంతి సభ స్థానిక యుటిఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాబ్జీ మాట్లాడుతూ రామిరెడ్డి ఉపాధ్యాయ ఉద్యమ రెండోతరం నాయకుడని, ఆయన నిబద్ధత కలిగిన నిస్వార్థమైన నేత అని కొనియాడారు. ఆయన ఆశయాలు, సేవలు ఆదర్శమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసి సంఘ అభ్యున్నతికి కృషి చేశారన్నారు. 1982లో ఎంఎల్‌సిగా పనిచేశారని, 16 సంవత్సరాల సర్వీసుని సంఘం కోసం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి ముస్తఫా ఆలీ, జిల్లా కార్యదర్శులు ఇ.శివశంకర్ ఎన్.రాంబాబు, ఎస్.సుధారాణి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రంగమోహన్ పాల్గొన్నారు.

## మేడే స్థూపం ధ్వంసంపై కార్మికుల ఆగ్రహం

**ఏలూరు అర్బన్:** ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ వాహనాల డ్రైవర్లు మేడే సందర్భంగా పంపులు చెరువుగట్టు, వెహికల్ షెడ్డు వద్ద నిర్మించుకున్న జెండా దిమ్మను మునిసిపల్ యంత్రాంగం ధ్వంసం చేయడాన్ని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కష్టపడే కార్మికులు వారు పని చేస్తున్న ప్రాంతంలో జెండా దిమ్మలు నిర్మించుకోవడం సహజమని, దీన్ని మున్సిపల్ యంత్రాంగం కూలగొట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. స్థానిక కార్పొరేటర్ ప్రోత్సాహంతో మున్సిపల్ యంత్రాంగం ఈ దుశ్చర్యకు పాల్పడిందన్నారు. ధ్వంసం చేసిన స్థూపాన్ని తిరిగి నిర్మించే విధంగా మున్సిపల్ యంత్రాంగం అన్ని చర్యలూ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ యంత్రాంగం రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ విధమైన చర్యలకు పాల్పడటం ఎంతమాత్రమూ సమంజసం కాదని వారు వివరించారు. జెండా దిమ్మ తిరిగి స్థాపించాలని, లేకుంటే ఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు.

## రామారావు మృతి తీరని లోటు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు కార్యకర్త, శతాధిక వృద్ధుడు విశాలాంధ్ర రాముగా పిలవబడే తాన్న రామారావు (101) అనారోగ్యంతో మంగళవారం ఏలూరు రాణినగర్‌లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. తాన్న రామారావు మృతికి సిపిఐ, ఎఐటియుసి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంతాపం తెలిపారు. రామారావు మృతదేహంపై సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ నాయకులు టివిఎస్.రాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, ఎస్.సంజీవరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామారావు మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామారావు మృతి ఆయన కుటుంబానికి, లౌకికవాదులకు, వామపక్ష పార్టీలకు, అభ్యుదయ వాదులకు తీరని లోటన్నారు. ఆయన మృతదేహాన్ని రామారావు కోరిక మేరకు కుటుంబసభ్యులు ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలకు అందించారు.

## పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోవాలి

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్ విధిగా తమ సిఎఫ్ఎంఎస్ ఐడీలను ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్‌నెంబర్ అనుసంధానం చేయాల్సి ఉందని జిల్లా ఖజానాధికారి టి.కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సిఎఫ్ఎంఎస్ ఐడీ, హెచ్ఆర్‌బి, పేరోలకు సంబంధించిన సేవలను పొందాలంటే ఈ అనుసంధానం అత్యవసరమని పేర్కొన్నారు. ఖజానా, లెక్కల శాఖ సంచాలకుడి ఆదేశానుసారం ఈ నెల పదో తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉందని తెలిపారు. పెన్షనర్ల సౌలభ్యం కోసం ఆయా మండలాల్లో ఇకెవైసి నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఏలూరు జిల్లా పరిధిలోని చింతలపూడి ఉప ఖజానా కార్యాలయ ఎగువ శ్రేణి గణాంకులు వి.వీర్రాజు, సిబ్బంది టి.నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. మండల పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు ఈ సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

## తడిసిన ధాన్యంపై ఉప్పు నీటిని చల్లాలి

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

అకాల వర్షాలకు నూజివీడు డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఎక్కడైనా ధాన్యం తడిస్తే ఐదు కిలోల ఉప్పును వంద లీటర్ల నీటితో కలిపి ఆ ద్రావణాన్ని తడిచిన ధాన్యంపై పిచికారీ చేసుకోవాలని నూజివీడు ఎడిఎ జి.విద్యాసాగర్ తెలిపారు. దీంతో తడిచిన ధాన్యం మొలక రాకుండా ఉంటుందని తెలిపారు.

## నూజివీడు రూరల్ ఇన్‌ఛార్జి ఎస్‌ఐగా రాధాకృష్ణ

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి ఎస్‌ఐగా రాధాకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న తలారి రామకృష్ణ గౌడ్ పోలీసు శిక్షణ నిమిత్తం వైజాగ్‌లోని శిక్షణా కేంద్రానికి తరలివెళ్లారు. నూజివీడు ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న రాధాకృష్ణారెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు నూజివీడు రూరల్ ఎస్‌ఐగా నియమించారు.

## పోలవరంలో భారీ వర్షం

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలో మంగళవారం పలుచోట్ల భారీవర్షం కురిసింది. ఇటుకలకోట, వింజరం, బోడిగూడెం, ప్రగఢపల్లి, ఎల్అండ్‌డి పేట, పోలవరం, పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వర్షానికి వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల డ్రెయినేజీలు పొంగిపొర్లాయి.

గ్రాడ్యుయేషన్ డేలో అంగన్‌వాడీలు, చిన్నారులు

## పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్చాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ళ పూర్తయిన పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించేందుకు గ్రాడ్యుయేషన్ డే పేరిట కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలో 85 అంగన్వాడీ కేంద్రాలుండగా వారిలో 315 మంది పిల్లలు గ్రాడ్యుయేషన్‌కి అర్హత సాధించారు. ఆయా కేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. రామచంద్రపురం, చేబ్రోలు, ఉంగుటూరు, కైకరం తదితర కేంద్రాల్లో పిల్లలను చక్కగా అలంకరించి వారికి బదిలీ సర్టిఫికెట్లు అందజేశారు.

## జగన్నాథస్వామి కళ్యాణోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

రెండో పూరీ జగన్నాథునిగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సమేత శ్రీజగన్నాథస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల ఎనిమిదో తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఛైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మూడో తేదీన స్వామివారిని, అమ్మవారిని పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించామన్నారు. నాలుగో తేదీ రాత్రి స్వామివారి దివ్యకళ్యాణం, ఐదో తేదీ రాత్రి రథోత్సవం, ఆరో తేదీ ఉదయం పూర్ణాహుతి, ఏడో తేది రాత్రి పవళింపు సేవ, ఎనిమిదో తేది ఉదయం 11 గంటల నుంచి స్వామివారి సన్నిధిలో అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఛైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, ఇఒ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## నేరాలు - ఘోరాలు

### టేకు మంచం పట్టివేత

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

అక్రమంగా టాటా ఎస్ వాహనంలో తరలిస్తున్న టేకు మంచాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ధర్మారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి జాతీయ రహదారిపై తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట నుంచి జంగారెడ్డిగూడెం వైపునకు అనుమానాస్పదంగా వెళ్తున్న టాటా ఎస్ వాహనాన్ని తనిఖీ చేయగా టేకు మంచాన్ని గుర్తించినట్లు తెలిపారు. మంచంతో పాటుగా టాటా ఎస్ వాహనాన్ని జంగారెడ్డిగూడెం అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించనున్నట్లు ఆయన తెలిపారు.

### చెట్ల నరికివేతపై ఫిర్యాదు

**ప్రజాశక్తి - ముసునూరు**

ఆర్అండ్‌బి రోడ్ల వెంబడి చెట్లను అక్రమంగా నరుకుతున్నారని రోడ్లు భవనాల శాఖ నూజివీడు డివిజన్ ఉప కార్యనిర్వహణ అధికారి సిహెచ్.బాబురావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలంలోని కాట్రంపాడు వద్ద గోపవరం నుంచి మీర్జాపురం వెళ్లే రహదారి వెంబడి చెట్లను కాట్రంపాడు గ్రామానికి చెందిన వ్యక్తి కొందరితో కలిసి అక్రమంగా నరుకుతున్నారని గ్రామస్తులు రోడ్లు భవనాల శాఖ నూజివీడు డివిజన్ ఉప కార్యనిర్వహణ అధికారి సిహెచ్.బాబురావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిహెచ్.బాబురావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# అందని వైఎస్ఆర్ ఆసరా సొమ్ము

### పోలవరంలో లబ్ధిదారుల ఆవేదన
### వారం రోజుల్లో జమవుతాయని ఎపిఎం స్పష్టత

**ప్రజాశక్తి - పోలవరం**

వైఎస్ఆర్ ఆసరా సొమ్ము ఇప్పటికీ పోలవరం మండలంలోని సుమారు 1700 మంది లబ్ధిదారుల ఖాతాల్లో పడలేదు. దీంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి 25వ తేదీన దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ ఆసరా డబ్బులు బటన్ నొక్కి విడుదల చేశారు. ఏప్రిల్ 6వ తేదీన పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు రూ.7.33 కోట్ల చెక్కును మండలంలోని డ్వాక్రా మహిళలకు పోలవరం మండల కేంద్రంలో అందించారు. వైఎస్ఆర్ ఆసరా డబ్బులు విడుదల చేసి నెల దాటినా తమ బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము ఇప్పటికీ జమ కాలేదని, సిఎలను అడిగితే రేపు మాపు అంటున్నారే తప్ప స్పష్టత ఇవ్వలేకపోతున్నారని పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఐకెపి ఎపిఎం బెజవాడ శ్రీనివాసరావును వివరణ కోరగా పోలవరం మండలంలో మొత్తం 943 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని, ఇప్పటివరకు 764 గ్రూపుల్లో ఉన్న సభ్యులకు వారి వ్యక్తిగత ఖాతాల్లో విడతల వారీగా నగదు జమ అయిందని చెప్పారు. ఇంకా 179 గ్రూపులకు సొమ్ము జమ కాలేదని తెలిపారు. మరో వారం రోజుల్లో 179 గ్రూపులకు విడతల వారీగా గ్రూప్ సభ్యుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతాయని ఆయన తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారులకు వంద శాతం నగదు జమ అవుతాయని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

## మండలాభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని అధికారులు, సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని ఎంపిపి కోర్స పోసమ్మ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వివరించారు. త్వరలో మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రానున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంత్, ఎంపిడిఒ కెఎం.మంగతాయారు, తహశీల్దార్ జి.ఎలీషా, ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సర్పంచి సున్నం ఉషారాణి, కో-ఆప్షన్ బూరుగు ప్రేమ్‌కుమార్, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ, సచివాలయల సెక్రటరీలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

## వికలాంగులకు బియ్యం, నిత్యావసర వస్తువులు


వికలాంగులకు నిత్యవసర సరుకులు అందిస్తున్న దాతలు

**ప్రజాశక్తి - భీమడోలు**

గుండుగొలను కేంద్రంగా శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవాసమితి చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులైన దాతలు పలువురు తమ వంతు సహకారాన్ని అందించేందుకు ముందుకు వస్తున్నారని సేవా సమితి గౌరవాధ్యక్షులు పేరిచర్ల శ్యామలరాజు తెలిపారు. సేవా సమితి నెలవారీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దాత మంతెన సత్యనారాయణరాజు సమితి ద్వారా ప్రతినెల సేవలందుకొంటున్న సుమారు 50 మందికి పైగా స్థానిక వికలాంగులకు సన్నబియ్యం, మామిడి పండ్లు అందించారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన ప్రయివేట్ స్కూలులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పద్మావతి వికలాంగులకు సబ్బులు, బ్రష్‌లు, పేస్టులు అందించారు. మరొక దాత దండు ధనుష్ పవన్‌వర్మ తన పుట్టినరోజును పురస్కరించుకుని వికలాంగులకు బిర్యానీ ప్యాకెట్లు, ఇతరాలు అందించారు. సేవా సమితి అభివృద్ధి కోసం రూ.పది వేల విరాళాన్ని అందించారు. అనంతరం సేవా సమితి తరపున ప్రస్తుత నెలవారీ సహాయాన్ని అందించిన దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు పాల్గొన్నారు.

## చెరువు అక్రమ తవ్వకాల ప్రాంతం పరిశీలన

### ప్రజాశక్తి వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు

చెరువు అక్రమ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని వైవాకలో జరుగుతున్న చెరువు అక్రమ తవ్వకాల పనులను మండల రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆక్వా చెరువు అక్రమ తవ్వకాలు ఆపాలి శీర్షికతో ప్రజాశక్తిలో ఈ నెల ఒకటో తేదీన ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆక్వా చెరువు తవ్వకం కారణంగా మంచినీటి చెరువులో నీరు కలుషితమవుతుందన్న గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు అక్కడ ఉన్న అభ్యంతరాలను తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదుదారులను పిలిచి గ్రామస్తులతో కలిసి వెళ్లి అభ్యంతరకరంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పి.యాకోబు, పలువురు మాట్లాడుతూ మంచినీటి చెరువుకు నీరు పెట్టే పంటబోదెకు మధ్య మూడు మీటర్ల దూరం వదిలి ఊట బోదె కొట్టాలన్నారు. ఊట బోదెకు మూడు మీటర్ల దూరం వదిలి ఊట బోదెకు గట్టు వేయాలన్నారు. ఊట బోదె గట్టుకు రెండు మీటర్లు వదిలి చేపల చెరువుకు గట్టు వేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. చేపలచెరువు గట్టు నుంచి పంటబోదె వరకు వదిలిన ఎనిమిది మీటర్ల భూమిని గ్రామ పంచాయతీకి ఇచ్చినట్లు పంచాయతీలో తీర్మానం చేయాలన్నారు. అప్పుడు చెరువు తవ్వుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని యాకోబు, పలువురు గ్రామస్తులు అధికారులకు తెలిపారు. దీంతో మండల ఎంఆర్ఐ పి.శివకుమార్, గ్రామపెద్దలు, పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తుల సమక్షంలో రైతు భూమిని ఎనిమిది మీటర్లు పంచాయతీకి అప్పగించేందుకు రైతు సుబ్బారావు అంగీకరించాడు. భూమి భవిష్యత్తులో పంచాయతీకే చెందేటట్లు, రైతుకు భూమిపై హక్కు లేదని పత్రం రాసేందుకు రైతు ఒప్పుకునాడు. పంచాయతీకి రాసిచ్చిన ఒప్పందపత్రం ఫిర్యాదుదారులైన తమకు ఇవ్వాలని యాకోబు కోరాడు. ఈ షరతులకు రైతు అంగీకరించాడు. ఈ ఒప్పందం ఫిర్యాదుదారులకు, గ్రామ పెద్దలకు, పంచాయతీ పాలకవర్గానికి అంగీకరయోగ్యంగా ఉండడంతో సమస్య కొలిక్కి వచ్చింది. ఆక్వా చెరువు అక్రమ తవ్వకాల విషయమై మండల ఆర్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వ హయాంలో చెరువు తవ్వకానికి అనుమతి వచ్చిందన్నారు. తవ్వకాలకు గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు ఉన్న కారణంగా అప్పట్లో చెరువు తవ్వకం జరగలేదని తెలిపారు.

## ధాన్యం సేకరణ వేగవంతం

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వైస్‌ఛైర్మన్, ఎమ్‌డి జి.వీరపాండ్యన్

**ప్రజాశక్తి - దెందులూరు రూరల్**

జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపట్టిన ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా జరిగేలా చూడాలని అధికారులను, కేంద్రాల నిర్వాహకులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వైస్‌ఛైర్మన్, ఎమ్‌డి జి.వీరపాండ్యన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని సీతంపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సువర్ణ రైస్ మిల్లును జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి వీరపాండ్యన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ధాన్యం సేకరణలో సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సీతంపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన ఈ కేంద్రం ద్వారా ఇంతవరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. 2,429 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. అలాగే గ్రామంలో ఎంతమంది రైతులున్నారని వారికి ఎన్ని ఎకరాలున్నాయని ఎమ్‌డి అడగ్గా 596 మంది రైతులకు 1500 ఎకరాలు సాగుభూమి ఉందని కొనుగోలు కేంద్రం సిబ్బంది తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రైతుల నుంచి శాంపిల్స్ సేకరణ, తేమశాతం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలింపు, ధాన్యం రకాలు, గోనె సంచులు, రవాణా తదితర అంశాలను రైతులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందితో సమన్వయం చేసుకుని రైతులకు మరింత అవగాహన పెంచి ఎక్కువ శాతం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందీ లేకుండా రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవచ్చన్నారు. రైతులు కొనుగోలు చేసిన ధాన్యంకోసం మిల్లులకు వెళ్లాల్సిన పనిలేదని వాటిని ఆర్‌బికె, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని, రైతులకు స్పష్టం చేశారు. వ్యవసాయశాఖ ద్వారా ఇ-క్రాప్ బుకింగ్ డేటా వస్తేనే తప్పా ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉండదన్నారు. కొంతమంది రైతులు ప్రతీ సంవత్సరం రైతులకు మెరుగైన పంట దిగుబడి వచ్చే వంగడాల గురించి ముందుగానే తెలియజేస్తే వాటిని సాగుచేసుకుని అధిక దిగుబడి పొందుతామని ఆ సమాచారాన్ని వ్యవసాయశాఖ ద్వారా రైతులకు తెలియజేయాలని ఎమ్‌డిని కోరారు. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా, రవాణా సౌకర్యం కల్పించిందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని కరపత్రాల ద్వారా, బ్యానర్ల ద్వారా రైతులకు అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు ధాన్యం కొనుగోలులో సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి ఆ సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

అనంతరం వీరపాండ్యన్ జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి సీతంపేటలోని సువర్ణ రైస్‌మిల్లును పరిశీలించారు. ఇప్పటి వరకూ మిల్లుకు చేరిన ధాన్యం వివరాలను జిల్లా రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరిని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్స్ వద్దకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని తెలిపారు.

వీరివెంట ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజరు మంజుభార్గవి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఆర్ఎస్ఎస్.రాజు, తహశీల్దారు నాంచారయ్య, వ్యవసాయశాఖ ఎడి వై.సుబ్బారావు, ఎఒ జి.రమేష్, సీతంపేట సొసైటీ అధ్యక్షులు వెంకట్రామయ్య, సర్పంచి కనకరాజు, రైతులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న వీరపాండ్యన్

## చింతలపూడి నియోజకర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా వెంకన్న

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

చింతలపూడి నియోజకర్గ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా చిప్పాడ నరసింహారావు (వెంకన్న) ఎన్నికయ్యారు . మంగళవారం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వెంకన్న వివరాలు వెల్లడించారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు ఏలూరు జిల్లా అధ్యక్షులు కొప్పాక వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చింతలపూడి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చింతలపూడి మండలం లింగపాలెంలో నిర్వహించారని తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షులుగా చిప్పాడ నరసింహారావు( వెంకన్న), ఉపాధ్యక్షులుగా దాక్షవరపు వెంకట గంగాధరరావు, ప్రధాన కార్యదర్శిగా నందిగం వెంకట సుబ్బారావు, జాయింట్ సెక్రెటరీగా చెడే ప్రసన్నకుమార్, కోశాధికారిగా కొక్కిరిపాటి సురేష్, ప్రచార కార్యదర్శిగా కట్టంగ సూరిబాబు, సహాయ ప్రచార కార్యదర్శిగా కొప్పాక నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు(వెంకన్న) మాట్లాడుతూ నియోజవర్గంలో ఉన్న నాయీబ్రాహ్మణులు ఐక్యతకు పాటుపడతామని ,ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.


వెంకన్నను అభినందిస్తున్న నాయకులు, ప్రముఖులు

## ప్రభుత్వ విధానాల వల్లే సంక్షోభం

**ఏలూరు అర్బన్:** ప్రభుత్వాల విధానాల వల్లే వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోతోందని రైతు కూలీ సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ అన్నారు. సంఘం జిల్లా మహాసభ మంగళవారం ఏలూరులోని షాది ఖానాలో ఘనంగా జరిగింది. తొలుత వందలాది మంది రైతులు, కూలీలు పాత బస్టాండ్ సెంటర్ నుంచి క్రరలవంతెన మీదుగా షాదీ ఖానా వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం షాది ఖానా వద్ద రైతు కూలీ సంఘం జెండాను రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.నాగరాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభకు రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పుంజం రామారావు అధ్యక్షత వహించారు. ఈ సభలో సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ 75 సంవత్సరాలుగా పాలకులు సామ్రాజ్యవాద దోపిడీకి అనుకూలమైన విధానాలు అవలంబించడం వల్ల వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఊరుకుపోయి రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటుపరం చేస్తూ భూములను, సమస్త సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్నారని విమర్శించారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

**నూజివీడు రూరల్:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తుండటంతో మొక్కజొన్నకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు పూర్తిగా తడిసిపోయి మొలకలు వస్తాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ

**నూజివీడు రూరల్:** మండలంలోని యనమదల గ్రామానికి చెందిన జర్నలిస్ట్ మాపర్తి సత్యం ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుని కుటుంబసభ్యులను మార్కెటింగ్ యార్డ్ మాజీ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ నేత కాపా శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టుల జీవితాలు తనకు తెలుసునని, పాత్రికేయులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## రీ సర్వేపై రైతుల అభ్యంతరాలు

**ముదినేపల్లి :** ముదినేపల్లిలో ఫేజ్-1 రీ సర్వేపై పలువురు రైతులు తమ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముదినేపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా రైతులు కొల్లి నాని, హనుమార పేర్నీడు, ఈడే శ్రీనివాసరావు, ఇతర రైతులు తమకు భూమి తక్కువగా వచ్చిందంటూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమకు 40 సెంట్ల మేర భూమి తక్కువ వచ్చిందని, పేర్నీడు, తనకు 10 సెంట్లు భూమి తక్కువ వచ్చిందంటూ కె.నాని, తనకు ఎనిమిది సెంట్లు తక్కువ వచ్చిందంటూ శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. సర్వే సరిగ చేయకపోవడంతో తాము భూమిని కోల్పోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ చేసిన భూ రీసర్వేలో రైతులకు కొలతల్లో అభ్యంతరాలుంటే మరల సర్వే చేసి వారి భూమిని అప్పగిస్తామని, రైతులు ఆందోళన చెందొదందనాన్నరు.

**పాస్‌పోర్టు పోయినది**

గుత్తి ఉమా మహేశ్వరరావు, తండ్రి: వీర వెంకట సత్యనారాయణ అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ : **R1855848** గల పాస్‌పోర్టు రామన్నపాలెం నుండి పెనుగొండ వస్తుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
**గుత్తి ఉమా మహేశ్వరరావు**
తండ్రి: వీర వెంకట సత్యనారాయణ
డోర్ నెంబర్: 3-39/1, మధ్యపాలెం,
రామన్నపాలెం, పెనుగొండ మండలం
ప॥గో॥జిల్లా, సెల్: 9550977910

**పాస్‌పోర్టు పోయినది**

జక్కంశెట్టి సర్వేశ్వరరావు, తండ్రి: నాగేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఏలేటిపాడు నుండి పేకేరు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు నెంబర్: **L7692685** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
**జక్కంశెట్టి సర్వేశ్వరరావు**
తండ్రి: నాగేశ్వరరావు, డోర్ నెం. 3-107
నిట్లావారి తోట, పేకేరు,
ఇరగవరం మండలం, ప॥గో॥జిల్లా,
పిన్: 534320, సెల్: 8096727817

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ఫస్ట్ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో**
**C.C. No. 1171/2021**

బిట్వీన్:
నరావుల శ్రీనివాసరావు -ఫిర్యాది
మరియు
బండి అమ్మాజి -ముద్దాయి

**ముద్దాయి:** బండి అమ్మాజి, W/o. బండి నాగ వెంకట సత్తిబాబు, వయసు 50, హిందూ, స్త్రీ, ఉద్యోగి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసు, సజ్జాపురం, తణుకు - 534211.

పై కేసులో ముద్దాయి అయిన మీరు పై చిరునామాలో వుంటూ సమన్లు తీసుకొనక తప్పించుకు తిరుగుచున్నందు వలన ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, పై కేసులో మీ హాజరు కొరకు **ది. 09-05-2023వ తేదీన వాయిదా అయి వున్నది. సదరు తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలసినది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
**జి.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ**
తాడేపల్లిగూడెం ఫిర్యాది తరపు న్యాయవాది
ది. 01-05-2023 తాడేపల్లిగూడెం

**మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో**
**ఇ.పి. నెం. 28/2022**
**ఒ.యస్. నెం. 221/2015**

బిట్వీన్:
ది పశ్చిమగోదావరి జిల్లా జూడిసియల్ ఎంప్లాయిస్ మ్యూట్యువల్లి ఎడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, ఏలూరు, రిప్రజెంటెడ్ ఇట్స్ ప్రెసిడెంటు -డిక్రీ హోల్డర్
మరియు
విసుమూర్తి శ్రీనివాస్ మరియు వగయిరా -జడ్జిమెంట్ డెటార్స్

**డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్**

పై నంబరు గల ఇ.పి.లో 1వ జడ్జిమెంట్ డెటార్ అయిన విసుమూర్తి శ్రీనివాస్, S/o. కృష్ణమూర్తి రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్, పి.జె.సి.జె.సి. మిలట్రీ కాంటిన్, మోతేవారితోట, రోడ్ నం.7, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 20-6-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు వారంటు గ్రంధము ఏకపక్షముగా విచారణ చేయుదురుని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

**ఆవుల జగన్మోహనరావు**
**పుప్పాల రామకృష్ణ,** అడ్వకేట్స్
ఏలూరు అశోక్‌నగర్, ఏలూరు, ఏలూరు జిల్లా
ది.23-4-23 సెల్:9989089289